క్లుప్తంగా

భగవద్గీత పుస్తకాలతో తులాభారం



భగవద్గీత పుస్తకాలతో తులాభారం తూగుతున్న కాళీకృష్ణ

దేవరపల్లి: స్థానికుడైన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సేవాదళ్ చైర్మన్ శ్రీకాకొళపు కాళీకృష్ణ స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భగవద్గీత పుస్తకాలతో తులాభారం మొక్కు చెల్లించుకున్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు మూడు పేజీల భగవద్గీత చదివి హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు. సుమారు 200 మంది భక్తులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

ఆరోగ్యానికి అందరూ వాకింగ్ చేయాలి



డాక్టర్ కల్యాణ్ చక్రవర్తిని సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నిడదవోలు రూరల్: పట్టణ వాకర్స్ క్లబ్ సమావేశాన్ని స్థానిక వాకర్స్ మైదానంలో క్లబ్ అధ్యక్షుడు రాజారామ్మోహన్‌రాయ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవనానికి వ్యాయామం ఆవశ్యకతపై స్థానిక శేషగిరి హాస్పటల్స్ డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా అందరూ వాకింగ్ చేయాలన్నారు.నడక వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం డాక్టర్ కల్యాణ్ చక్రవర్తిని వాకర్స్ క్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజా, కోశాధికారి రాజేష్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎ.శ్రీలక్ష్మి, కౌన్సిలర్ ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది

గోపాలపురం: న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా మహిళలకు వారి హక్కులపై అవగాహన కల్పిస్తామని కొవ్వూరు ప్యానెల్ అడ్వకేట్‌లు జానపాటి చంద్రశేఖర్, పి.తారా కుమారి అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతీరావు పూలే సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్‌లు మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. వేధింపులు, గృహహింస బారిన పడిన బాలికలకు ప్రభుత్వం ఉచిత న్యాయ సహాయం అందించి అండగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ ఎంఎస్ సాయినాథ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులకు శిక్షణ

కొవ్వూరు: ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను భవిష్యత్తులో ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు అన్నారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఇదేం కర్మ రాష్ట్రానికి విజయవంతంగా నడపాలని రామకృష్ణారావు సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ పెనుమాక జయరాజు, మరపట్ల కళాధర చక్రవర్తి, రాజాన శ్రీనివాస్, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు దాయిన రామకృష్ణ, శీని ప్రసాద్, గెల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో డిస్కౌంట్ సేల్స్

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియం ఆధ్వర్యంలో భారీ డిస్కౌంట్ సేల్స్‌తో వస్తువులు విక్రయిస్తున్నామని లేపాక్షి సంస్థ మేనేజర్ ఎ.కార్తీక్ కుమార్ ఒక ప్రకటనలో శనివారం తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియంలో డిస్కౌంట్ సేల్‌లో ఎంపిక చేసిన వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్లు ప్రకటించామన్నారు. ఈ అమ్మకాలు ఈ నెల 31వ వరకు నిర్వహిస్తామన్నారు. అన్నిరకాల కొండపల్లి బొమ్మలు, ఎటికొప్పాక బొమ్మలు, బంజారా ఐటమ్స్, చేనేత వస్త్రాలు, కలంకారీ కాటన్ చీరలు, కలంకారీ ఐటమ్స్ మరెన్నో విభిన్న వస్తువులు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పల్లెలకు ఆరోగ్య రక్ష

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమాల నిర్వహణ
- బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి

నిడదవోలు రూరల్: గ్రామీణుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పంచాయతీ స్థాయిలోనే టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గతనెల 28న ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనకు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలనే సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు. నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని 62 సచివాలయాల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు కానున్నాయి.

ఆరుగురు సభ్యులతో కమిటీ

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ- మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్-ఎంఎల్‌హెచ్‌ఓ) ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు.



సింగవరంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ

గ్రామీణుల ఆరోగ్యంపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తించాలి. వారి అనారోగ్యాల నివారణ చర్యలు, గ్రామ ప్రజల జీవనశైలి, రోగాల నివారణ, చికిత్సలపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిత్యం అప్రమత్తంగా ఉండాలి.

- పాఠశాల విద్యార్థుల ఆరోగ్య వివరాలను స్కూల్లోనే హెల్త్ అంబాసిడర్ పర్యవేక్షించాలి. కౌమార దశలోని బాలికలకు రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషకాహారం అందించాలి.
- యుక్త వయసు బాలికలకు శానిటరీ ప్యాడ్ల సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజనం వివరాలను కమిటీ లీడర్లకు అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పిల్లల రక్తహీనతపై పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవానికి ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు సక్రమంగా అందేలా సమన్వయం చేసుకోవాలి.
- గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీమ్ లీడర్ విధిగా హాజరయ్యేలా టీంలో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలి. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇమ్యునైజేషన్ ద్వారా రోగ నిరోధకతను పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి.
- బాల్య వివాహాలు నివారించడంతో పాటు యుక్త వయస్సులో గర్భాలను నిరోధించాలి. కుటుంబ నియంత్రణ ప్రణాళిక అమలు చేయాలి. ప్రతి శుక్రవారం డ్రై డే పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తాం. సంపూర్ణ ఆరోగ్యం దిశగా పల్లెలను తీర్చిదిద్దుతాం. ఈ కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామీణుల అనారోగ్య సమస్యలను పరిష్కరించవచ్చు. ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు చర్యలు చేపట్టాం.

– టి.మూర్తిబాబు, ఎంపీడీఓ, నిడదవోలు

ప్రజలకు ఎంతో ఉపయోగం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్ ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

– ఎ.అమరేంద్ర, పీహెచ్‌సీ వైద్యాధికారి, సమిశ్రగూడెం

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు
- కొవ్వూరులో జిల్లా కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు

కొవ్వూరు: ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించి, వారి సేవలను కేవలం బోధనకే వినియోగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీపీ సాల్మన్‌రాజు కోరారు. ఏపీటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అధ్యక్షతన ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ ఎయిడెడ్ స్కూల్లో నిర్వహించారు.ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఈ సందర్భంగా సాల్మన్‌రాజు కోరారు. జిల్లా అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 3,4,5 తరగతుల విలీనాన్ని, పని సర్దుబాటులో భాగంగా చేసిన అక్రమ డిప్యుటేషన్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి, వేతనాల్లో అంతరాలను తొలగించాలని రాష్ట్ర కౌన్సిలర్ మహ్మద్ సిరాజ్ విన్నవించారు. జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు చెల్లించాలని కోరారు. గోపాలపురం, నిడదవోలు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరస్వామికి బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో గోష్పాదేశ్వరస్వామి



ప్రక్కిలంకలో రామాలయ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న వేద పండితులు



గోపాలపురం మండలం నందిగూడెంలో దుర్గమ్మకు పూజలు

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ, అనంతరం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. దేవికి కుంకుమార్చనలు, స్వామి వారికి బిల్వార్చన అనంతరం రుద్ర హోమం నిర్వహించారు.ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలను పర్యవేక్షించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగిన ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలోని కాళింగపేటలో పునఃనిర్మించిన రామాలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు రెండో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. కాగా సోమవారం ఉదయం సీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుంది. వేదపండితులు కొతవరపు విశ్వనాథశర్మ బృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

నందిగూడెంలో దుర్గమ్మ ఉత్సవాలు

గోపాలపురం: మండలంలోని నందిగూడెంలో కొలువైన కనకదుర్గమ్మ, పెద్దింట్లమ్మ వార్ల ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే అమ్మవార్ల ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. భక్తులు అమ్మవార్లకు పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, పోలవరం, గోపాలపురం, దేవరపల్లి తదితర ప్రాంతాల అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

తనువంతా విరబూయంగ..



ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడులో విరబూసిన మామిడి చెట్టు

ఉగాది సమీపిస్తోంది. మామిడి చెట్లు పూతతో కళకళలాడుతున్నాయి. మండలంలోని దొరసానిపాడులో ప్రధాన రహదారి పక్కన గల ఈ మామిడి చెట్టు పూతతో కనువిందు చేస్తోంది. ఆకు కూడా కనబడనంతగా పూత విరబూసింది. తెలుగు సంవత్సరాదికి శుభ స్వాగతం పలుకుతోంది.

ద్వారకా తిరుమల

సీఎం సహాయ నిధి సాయం అందజేత



సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఇద్దరు లబ్ధిదారులకు హోం మంత్రి తానేటి వనిత ఆదివారం అందజేశారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వైద్య ఖర్చుల నిమిత్తం కొవ్వూరు పట్టణానికి చెందిన మట్టే సీతారామాంజనేయులుకు రూ.3 లక్షలు, తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన నామన శివసాయికి రూ.2 లక్షల చెక్కును మంత్రి అందజేశారు.కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, నాయకులు ఉప్పులూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా మెలగాలి

చాగల్లు: బీసీలు అందరూ ఐక్యంగా ఉండాలని బీసీ సంఘం మండల నాయకుడు బొర్రా కృష్ణారావు అన్నారు. బీసీ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం మండలంలోని ఊనగట్ల గ్రామంలో నిర్వహించారు. బీసీలందరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమావేశంలో పలు సమస్యల గురించి నాయకులతో చర్చించారు. కార్పొరేషన్ డైరెక్టర్లు సంసాని రమేష్, పొన్నాడ సింహాద్రి, బీసీ సంఘం నాయకులు అయినం నాగరాజు, మారిశెట్టి సత్తిబాబు, వీరవల్లి సత్యనారాయణ, తాత శ్రీహరి, కట్టా స్వామి, చిటికెన బాబీ, మూల వెంకటరమణ, బొర్రా రజజీ, కొరు శ్రీను, మల్లుల వెంకటేశ్వరరావు, పిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెదురు .. రేటు బెదురు

- ధరలు పెరగడంతో అరటి రైతులకు ఇబ్బందులు
- రూ.80 నుంచి రూ.140 రేటు పలుకుతున్న వెదురు



తీపర్రు వద్ద సర్పాపురం కాలువలో ఊరబెట్టిన వెదుర్లు

పెరవలి: తుపానులు, బలమైన గాలుల నుంచి అరటి తోటలను రక్షించుకోవడానికి ఆ చెట్లకు ఆసరాగా రైతులు వెదుర్లు కడుతుంటారు. అరటి తోటలు వేసిన రైతులందరికీ వెదురు బొంగులు అవసరం. అయితే మార్కెట్‌లో వెదురు ధరలు రోజురోజుకూ పెరుగుతుండడం రైతులకు సమస్యగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో సైజును బట్టి ఒక్కో వెదురు రూ.80 నుంచి రూ.140 రేటు పలుకుతోంది. అరటి తోట రకాన్ని బట్టి రైతులు తమకు అవసరమైన వెదుర్లను కొనుగోలు చేస్తున్నారు. రేటు కొంత ఎక్కువైనా నాలుగైదు కార్సిల వరకూ వెదుర్లు ఉపయోగపడేలా సాధనం వెదుర్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పెరవలి మండలంలో వరి తరువాత అధిక విస్తీర్ణంలో అంటే దాదాపు 5,500 ఎకరాల్లో అరటి సాగవుతోంది. కర్పూర, తెల్ల చక్కెరకేళీ, అమృతపాణి, బొంత రకాల తోటలకు ఈ వెదుర్లు వినియోగిస్తారు. రాబోయే వేసవిలో ఈదురు గాలులు సంభవించే అవకాశాలు ఎక్కువ. వాటి బారి నుంచి అరటి తోటలను రక్షించుకోవాలంటే ఇప్పుడే వెదుర్లను కొనుగోలు చేసుకోవాలి. వేసవి వచ్చేటప్పటికి తోటలు ఈనిక దశలో ఉంటాయి. అదే సమయంలోనే ఈదురు గాలులు వీచే అవకాశాలు ఎక్కువ. అప్పుడు ఈ తోటలకు వెదుర్లు వేస్తారు. ఇప్పుడైతే తక్కు రేటుకు లభిస్తాయనే ఉద్దేశంతో రైతులు ముందుగా ఉండే వెదుర్లను కొనుగోలు చేసి, కొలముల్లోను, కాలువల్లోను నిలగట్టి ఉంచుతారు. ఇలా చేయడం వల్ల వెదుర్లలో చేవ శాతం పెరిగి అరటి చెట్టుకు గట్టి మోపుగా ఉంటుంది. ప్రస్తుతం ఎక్కువగా రైతులు రూ.100 విలువైన వెదుర్లనే కొనుగోలు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చాగల్లు: నిడదవోలు -పంగిడి రహదారిపై చాగల్లు జూనియర్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో మండలంలోని మీనానగరం గ్రామానికి ఇద్దరు యువకులు గాయపడ్డారు. మోటార్ సైకిల్‌పై ఊనగట్ల వైపు వెళుతున్న వారిద్దరూ ప్రమాదవశాత్తూ అదుపు తప్పి బైక్‌పై నుంచి కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు చాగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించారు.

టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా జయ

పెరవలి: మండలానికి చెందిన అనపర్తి జయను రాయలసీమలోని రాయచోటి ఎమ్మెల్సీ ఎన్నికలకు పరిశీలకునిగా తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం నియమించింది. దీంతో జయ రాయచోటి వెళ్లారు. కాగా ఆయన టీడీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

8న ఉచిత క్యాన్సర్ పరీక్షలు

కంబాలచెరువు: ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐఎంఏ మహిళా విభాగం, రాజమండ్రి ఆబ్ స్టెట్రిక్ అండ్ గైనికాలజీ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని గైనిక్ ఆసుపత్రుల్లో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ విభాగానికి చెందిన డాక్టర్ కస్తూరి విజయలక్ష్మి, డాక్టర్ అనసూరి పద్మలత తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో మహిళా వైద్యులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంబాల చెరువు మెయిన్ గేటు నుంచి పుష్కర్ ఘాట్ వరకూ ర్యాలీ జరిగింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి మహిళా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఆర్‌వోజీఎస్‌వై ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ హాస్టల్స్ బాలికలకు పోషకాహారం, నెలసరి సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత గురించి అవగాహన కల్పించనున్నామన్నారు. ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి, శానిటరీ పాడ్స్ పంపిణీ చేస్తామన్నారు. మార్చి 8వ తేదీన అన్ని గైనిక్ హాస్పిటల్స్ లో ఉచిత కాన్సర్ నిర్ధారణ పరీక్షలు, బ్రెస్ట్ స్కానింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనసూరి ప్రియాంక, డాక్టర్ చంద్రిక, డాక్టర్ దేవిశ్రీ మురారి, డాక్టర్ పద్మజ, డాక్టర్ దివ్య, డాక్టర్ చిట్టిసుధ, డాక్టర్ వై.సునీత, డాక్టర్ డి.లక్ష్మి, డాక్టర్ స్పందన, డాక్టర్ కె.హారిక, డాక్టర్ పి.రేణుక, డాక్టర్ అశ్విని పాల్గొన్నారు.

మానవత సంస్థకు రూ.50 వేల విరాళం



దాత యశ్వంత్ చౌదరి

నల్లజర్ల: మానవత స్వచ్ఛంద సంస్థ నల్లజర్ల మండల శాఖకు అదే గ్రామానికి చెందిన మల్లిన రమేష్ కుమారుడు యశ్వంత్ చౌదరి ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు.ఆయన ప్రస్తుతం అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సంస్థలో డేటా మోడలింగ్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నారు. మానవతకు విరాళం అందించిన సందర్భంగా ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు గుళ్లపూడి వెంకటరత్నం, జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై మహిళలకు జాగ్రత్తలు అవసరం



చంద్రవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

చాగల్లు: తమ ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని చంద్రవరం విలేజ్ క్లినిక్‌లో ఆదివారం మహిళల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్తీ ఉమెన్- హెల్తీ ఇండియా అనే మహిళలకు అంశంపై అవగాహన కల్పించారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బండి అశోక్‌బాబు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని కాట కోటేశ్వరంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.